మేయర్ నీలా గోపాల్‌రెడ్డిని కలిసిన రాగిడి కుటుంబీకులు

మేయర్ నీలాగోపాల్‌రెడ్డిని కలిసిన రాగిడి లక్ష్మారెడ్డి కుటుంబీకులు

దుండిగల్,మార్చి22:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డిని శుక్రవారం హిల్‌కౌంటలోని ఆమె నివాసంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజినీ తోపాటు ఆయన కుటుంబసభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాగిడి రజినీ మాట్లాడుతూ.. తన భర్త రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు సహకరించాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మేయర్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి గెలుపుకు అంకితభావంతో పనిచేస్తామన్నారు. కేసీఆర్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

భూమినికుంట చెరువులో పడి వ్యక్తి మృతి

భాష(ఫైల్)

మూసాపేట, మార్చి22: భూమిని కుంట చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హస్తల్‌పూర్ గ్రామానికి చెందిన జూపాటి భాష (28) కూకట్‌పల్లి హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మెడికల్ షాపుకి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం భూమినికుంట చెరువులో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడా? ఇతర కారణాలు అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉన్నది. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేగులకుంట సుందరీకరణకు కృషి

■ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కొండాపూర్, మార్చి 22:మురికి కూపంగా మారిన రేగులకుంటకు మహర్దశ చేకూరిందని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం ఆయన చందానగర్ డివిజన్ పరిధి దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మురికి కూపంగా, కంపుకొడుతూ, దుర్గంధభరితంగా ఉండే రేగులకుంట సేల్స్‌ఫోర్స్ సాఫ్ట్ వేర్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.1.50 కోట్లతో సుందరీకరణ పనులు ప్రారంభించడంతో కుంటకు మహర్దశ చేకూరిందన్నారు. కుంటలోకి వచ్చే మురుగును అరికట్టడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. చెరువు చెట్టు ఫెన్సింగ్‌తోపాటు వాకింగ్ ట్రాక్, పచ్చదనం వృద్ధికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యేతో పాటుగా సేల్స్‌ఫోర్స్ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, రాజశేఖర్, అవినాష్, కాశీనాథ్ యాదవ్, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయ నాగ పునఃప్రతిష్ట

శేరిలింగంపల్లి, మార్చి 22: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవత సహిత నాగ పునఃప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రామస్వామి యాదవ్, లక్ష్మీ నారాయణ గౌడ్, రాజేశ్వరమ్మ, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు మిరియాల రాఘవరావు, రమణమూర్తి, కరుణాకర్ గౌడ్, మల్లారెడ్డి, పద్మారావు, లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనివాస రావు, శ్రీనివాస్ గౌడ్, కాశీనాథ్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ ఏఐ-మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్ కోర్సు ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

శేరిలింగంపల్లి, మార్చి 22:గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో ఏఐ-మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్ పేరిట లెవల్-05 కోర్సును శుక్రవారం ప్రారంభించారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్(ఎంఎస్‌డీఈ) సౌజన్యంతో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో ఈ కోర్సును నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పలువురు అతిథులు మాట్లాడుతూ..యువతో కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు పెంచేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేబీఐఈటీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీసీ కృష్ణమాచారి, జేబీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ సంజయ్, ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు, కాలేజీ ఎఫ్‌డీపీ సెల్ హెడ్ సాయి కిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజేషన్‌పై ఎస్ఎఫ్ఏలకు అవగాహన

జోనల్ కార్యాలయంలో ఫేస్ రికగ్నైజేషన్‌తో హాజరు నమోదు చేస్తున్న ఎస్ఎఫ్ఏ

మియాపూర్, మార్చి 22: పారిశుధ్య కార్మికుల హాజరులో అక్రమాలకు కళ్లెం వేసేందుకు అధునాతన సాంకేతికతను శేరిలింగంపల్లి జోనల్ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈమేరకు ఫేస్ రికగ్నైజేషన్‌పై సిస్టం ద్వారా క్షేత్రస్థాయిలో సిబ్బంది హాజరు నమోదును ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు గాను శుక్రవారం ఇక్కడి జోనల్ కార్యాలయంలో ట్రయల్ రన్‌ను నిర్వహించారు. జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్ల నుంచి 100 కు పైగా ఎస్ఎఫ్ఏలకు ఇక్కడి కార్యాలయంలో ఈ నూతన విధానంపై జడ్సీ స్నేహ శబరీష్ ఆదేశాలతో జోనల్ డీసీ వేణుగోపాల్‌రెడ్డి నేతృత్వంలో అవగాహన కల్పించారు. ప్రతి సర్కిల్ నుంచి నలుగురైదుగురు చొప్పున పారిశుధ్య సిబ్బందికి ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా ఎస్ఎఫ్ఏల ఫోన్‌లలో నిక్షిప్తం చేసిన యాప్‌లో హాజరు నమోదు ట్రయల్ రన్ చేపట్టారు. ఈ విధానంపై పలువురు ఎస్ఎఫ్ఏలు తమ అనుమానాలను అధికారులకు విన్నవించారు. తొలుత ట్రయల్ రన్ విజయవంతం కావడంతో... ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయిలో దీనిని అమలు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు జోనల్ అధికారులు పేర్కొన్నారు.

నీటి వృథాను అరికట్టి.. భవిష్యత్‌తరాలకు అందించాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్

జీడిమెట్ల, మార్చి22 : నీటిని వృథా చేయకుండా భవిష్యత్‌తరాల అవసరాలకు భూగర్భజలాలను సంరక్షించుకునేలా ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం సూరారంలోని నార్త్‌సిటీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటి వృథాను అరికట్టి, భవిష్యత్ తరాలకు అందించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృథా నీటిని ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉండే చెట్లు, మొక్కలకు వెళ్లేలా చూసుకోవాలని, ఇంటిపై ఉండే ట్యాంకులు నిండాకా నీరు వృథా కాకుండా ఇంటి ముందు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కానుకలు, ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడంతో పాటు కానుకలు అందజేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైనార్టీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వమతాలకు సమాన ప్రాతిపదికన పండుగల సమయంలో నిరుపేదలకు కానుకలు అందజేయడంతో పాటు విరివిగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇఫ్తార్ విందులను నిర్వహిస్తుందని ప్రకటించి ఎల్బీస్టేడియంలో తూతూ మంత్రంగా ఏర్పాటు చేయడం సరికాదన్నారు. డివిజన్ల వారీగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఖదీర్, మహ్మద్ హర్షద్, మహ్మద్ ఖాజా, మిరాజ్, ముస్తఫా, అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు. **– బాలానగర్, మార్చి22**

మెస్ చార్జీలు, ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 22 : విద్యార్థుల మెస్ చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా వర్సిటీ అధికారులు కృషి చేయాలని జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావుకు విద్యార్థులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కళాశాల, అనుబంధ కళాశాలలో చదువుతున్న విద్యార్థులంతా మెరిట్‌తో సీట్లు సాధించామని.. గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులంతా ఫీజ్ రియంబర్స్‌మెంట్, మెస్ చార్జీలపై ఆధారపడి చదువుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సుమారు రూ.6 కోట్ల మెస్ చార్జీలు, రూ.20 కోట్లకు పైగా ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై వర్సిటీ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు రాహుల్ నాయక్, శివకృష్ణ, రంజిత్‌కుమార్, చంద్రశేఖర్, బ్రహ్మం, ఆంజనేయులు, సిద్ధార్థ, ఆదిత్య, కల్యాణ్, సాయిదినేశ్, దిలీప్ తదితరులున్నారు.

బీవీఆర్ఐటీ హైదరాబాద్‌లో పదవ జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవాలు

దుండిగల్,మార్చి 22 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'మేధాన్వేష్ 2కే24' పేరుతో రెండు రోజులపాటు జరుగనున్న జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాల్లోని 30 కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంకేతిక పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎలికో కంపెనీ వైస్‌చైర్‌పర్సన్ వనిత డాట్ల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి ప్రతిభగల మహిళలు ఎంతో అవసరమని, మహిళలు తమ కార్యస్థలములో దీర్ఘకాలిక లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా.కేవీఎన్.సునీత, మేధాన్వేష్ 2కే24 సమన్వయకర్త డా.అమ్రిత మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అన్ని రకాల సాంకేతికతల మీద విద్యార్థులకు అవగాహన కలిగేలా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సాంకేతిక ఉత్సవాలకు వివిధ కళాశాలల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు.

సాంకేతిక ఉత్సవాల్లో పాల్గొన్న వనిత డాట్ల, కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీఎన్. సునీత తదితరులు

■ డీఆర్‌సీని పరిశీలించిన ఏఆర్‌వో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్నికల సామగ్రి పంపిణీ స్వీకరణ(డీఆర్‌సీ) కేంద్రాన్ని నియోజకవర్గ ఏఆర్‌వో, జడ్సీ స్నేహ శబరీష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని షెడ్లు, స్ట్రాంగ్ రూమ్‌లను, ఇతర వసతులను ఆమె పరిశీలించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలోనే డీఆర్‌సీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో అప్పటి ఏర్పాట్లు ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డీఆర్‌సీ కేంద్రాన్ని ముందస్తుగా పరిశీలించినట్లు, అవసరమైన వసతులను సమీక్షించినట్లు ఏఆర్‌వో స్నేహ శబరీష్ పేర్కొన్నారు. **– మియాపూర్, మార్చి 22**

■ ఆర్ట్ గ్యాలరీలో 'తెలంగాణ ఆర్ట్ గ్రూప్ షో -2024'

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా చిత్రకారులు వేసిన చిత్రాలకు మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా నిలిచింది. శుక్రవారం ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ ఆర్ట్ గ్రూప్ షో -2024 ప్రారంభమైంది. పద్మశ్రీ అక్క యాదగిరిరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రముఖ చిత్రకారుడు తోట వైకుంఠం, ప్రొఫెసర్ ఎస్ఎం పీరన్, జీవై గిరి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంవీ రమణారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కళాకారులతో కలిసి ప్రదర్శనలోని చిత్రాల వివరాలను తెలుసుకుంటూ తిలకించారు. ప్రదర్శనలో 144 మంది చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. కాగా, ఈ ప్రదర్శన ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. **– కొండాపూర్, మార్చి 22**

అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

దుండిగల్,మార్చి 22 :అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని ప్రజలు,కాలనీ వాసులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.శంభీపూర్ కృష్ణ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని అన్నారు.

కూకట్‌పల్లి మార్కెట్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 22 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 21, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 65, ఆలుగడ్డ 21, కీరా 23, దోసకాయ 15, సొరకాయ 9, పొట్ల కాయ (1) 18, కందగడ్డ 23, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 15, గుమ్మడికాయ 23, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, ములగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని 51, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

పంచలోహ అయ్యప్ప స్వామి విగ్రహాప్రతిష్ఠాపన

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్రకాలనీలో శ్రీహరిహర క్షేత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన పంచలోహ అయ్యప్ప స్వామి విగ్రహాప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, కిసాన్‌మోర్చా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమిల్ల సంజీవ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. **– కుత్బుల్లాపూర్,మార్చి22**

- కొంపల్లి మున్సిపాలిటీలో వింత పరిస్థితి..
- సుమారు 26 మొదటి నోటీసులు..16 రెండవ నోటీసులు
- అక్రమ నిర్మాణదారుల నోటీసులకు రిపై దాఖలాలే లేవు
- సంతకాలకే పరిమితమైన ఇన్‌చార్జి టీపీఓ..

నో టీసులిచ్చినా పట్టించుకోవట్లేదు..

ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ స్థలంలో అక్రమ నిర్మాణంపై నోటీసులను అందజేసిన కొంపల్లి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు అక్రమ షెడ్లు, ఇతర నిర్మాణాలతో పాటు చెరువుల ఎఫ్టీఎల్ స్థలాలపై ఫిర్యాదులు వచ్చాయి. అలాంటి వాటికి ముందస్తుగా నోటీసులు జారీ చేస్తున్నాం. తర్వాత రెండవ సారీ జారీ చేసి డెమాలిషన్ టీంకు రెఫర్ చేస్తున్నాం. కొంతమంది కోర్టు నుండి స్టేలు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. వీలైనంత త్వరితగతిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఎఫ్టీఎల్ స్థలాల రక్షణపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– శ్రీహరి, కమిషనర్ కొంపల్లి మున్సిపాలిటీ

కుత్బుల్లాపూర్,మార్చి 22: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. అక్రమణదారులకు అధికారులు నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడంలేదు. ఈనెల 19న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'ఫాక్స్‌సాగర్‌లో అక్రమ నిర్మాణాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. శుక్రవారం టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి అక్రమ నిర్మాణానికి నోటీసులు జారీ చేశారు. దానికి తిరిగి సమాధానం రాకపోతే రెండవ సారి నోటీసులు జారీ చేసి వెంటనే డిమాలిష్ టీంకు పంపిస్తామని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తెలిపారు. కాగా, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓ వింత పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ స్థలాలైనా, అక్రమ నిర్మాణాలైనా జరిగితే కేవలం నోటీసులు ఇచ్చి తప్పుకుంటారే తప్పా తదుపరి కార్యాచరణకు నోచుకునే దాఖలాలే ఉండవని పలు విమర్శలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు షెడ్లు, అక్రమ నిర్మాణాలతో పాటు ఎఫ్టీఎల్ స్థలాల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సుమారు 26 మొదటి నోటీసులు జారీ కాగా, ఇందులో 16 రెండవ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే మొదటి నోటీసుల ఎలాంటి సమాధానం రాకుండా ఉంటే రెండవసారి జారీ చేసిన నోటీసుతో డిమాలిష్ టీంతో సంబంధిత అక్రమ నిర్మాణాలను కూల్చివేసే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి తావే లేకుండా పోతుందని పలువురు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఎన్నికల హడావుడిలో ఉన్న అధికారులు, సిబ్బంది తమ విధుల్లో బిజీగా ఉండడంతో ఇటు అక్రమణదారులకు ఇదే ఆసరాగా మారడంతో అడ్డూఅదుపు లేకుండా పోతుందని పలువురు భావిస్తున్నారు. కాగా స్థానికంగా టీపీఓగా స్థానంలో ఉన్న అధికారి ఇలాంటి అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలి. కానీ ఇన్‌చార్జి అధికారిగా కొనసాగడంతో వారానికి ఒక సారి రెండుసార్లు మాత్రమే ఇక్కడికి వచ్చి వచ్చిన ఫైళ్లపై సంతకాలు చేయడానికి మాత్రమే పరిమితంగా మారాడని విమర్శలు ఉన్నాయి. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అంతరించిపోతున్న ఫాక్స్‌సాగర్ ఎఫ్టీఎల్ స్థలాలను పరిరక్షించడతో పాటు అక్రమ నిర్మాణాల నియంత్రణపై జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలతో.. జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

నిందితుడు మునిగాల కిరణ్

దుండిగల్, మార్చి 22: మత్తు పదార్థాల విక్రయాలతో తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి నిషేధిత మత్తు పదార్థమైన అల్ప్రాజోలంను తయారు చేసి విక్రయిస్తూ, గతేడాది పట్టుబడిన మునగాల కిరణ్ (43) అక్రమ ఆస్తులను జప్తు చేసి, ప్రభుత్వానికి అప్పగించినట్టు తెలిపారు. సూరారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మునగాల కిరణ్ కుమార్ 2021 నుంచి పోలీసుల కళ్లుగప్పి ఇండ్రస్ట్రీయల్ ఏరియాల్లో కెమికల్ కంపెనీ పేరిట నిషేధిత మత్తు పదార్థాలను తయారు చేసి విక్రయిస్తూ గతేడాది డిసెంబర్ 27న పోలీసులకు చిక్కాడని తెలిపారు. అతడిపై, అతడి భార్యపై ఉన్న రూ.68.50 లక్షల విలువైన ఆస్తులను జప్తు చేసి ప్రభుత్వానికి అప్పగించామన్నారు. వారికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్లను సైతం ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సూరారం ఇన్‌స్పెక్టర్ ఆకుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మెలోడిస్ సునీత సంగీత విభావరి

పాటలను ఆలపిస్తున్న సింగర్ సునీత

కొండాపూర్, మార్చి 22 : మెలోడిస్ క్వీన్ సునీత ఉపద్రష్ట తన గాత్ర మాధుర్యంతో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచింది. శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఎస్‌వీయం గ్రాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ సింగర్ సునీత సంగీత విభావరి ఆద్యాంతం ఆహ్లాదకరంగా సాగింది. సంగీత ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న సునీత, తన గాత్రతో సంగీత ప్రియుల్ని అలరించింది. తెలుగు, తమిళ భాషలలో ఉత్తమ మెలోడియస్‌ను ఆలపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాంగో మీడియా రామ్, కోన వెంకట్, సంగీత, దర్శకులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, ఇతర సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తున్న రోడ్డు

అల్లాపూర్ డివిజన్ పరిధి ఏజిఐ గ్లాస్ ఫ్యాక్టరీ క్వార్ట్స్ దారిలో రోడ్డు పై ఇష్టానుసారంగా చెత్తను డంప్‌చేయడంతో దురువాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోవతున్నారు. రోడ్డు పై చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఆటంకం కలుతుతున్నది. ఎప్పటికప్పుడు చెత్తను ఎత్తాల్సిన శానిటేషన్ సిబ్బంది, జాప్యం చేయడంతో కుప్పలు తెప్పలుగా రోడ్డుపై చెత్త పేరుకుపోతున్నది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు,రోడ్డ పై చెత్త డంప్ చేసేవారిపై శానిటేషన్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– అల్లాపూర్,మార్చి22

బాలుడి అదృశ్యం

సాయికిరణ్(ఫైల్)

శేరిలింగంపల్లి, మార్చి 22: ఇ